# ముక్తాయింపు

[ కథానిక ]

శ్రీ పి. శ్రీనివాసరావు

ఆమె కళ్లల్లోంచి అశ్రువులు రాలుతూవున్నాయి ...కాదు...తీరని వ్యథతో ఆమె హృదయమే కరిగి ప్రవహిస్తున్నదేమో! ముసలితనంతో ముడతలు పడ్డ ఆమెచెక్కిళ్లమీదుగా కన్నీరు పరిగా జారలేక పోతున్నది...తన కళ్లయెదుటే, తన జీవితంలోనే, యీవిపత్తు రావడంకన్నా తనే చనిపోయినా బాగుణ్ను. ...తన రక్తమాంసాలు పంచుకుని పెరిగి, యీ వృద్ధాప్యంలో, గుండెలు చీల్చి...పోయాడు...తండ్రిని అనుసరించి పోయాడు...జీర్ణదశలో వున్న వృక్షం... ఆధారం లేకపోతే కూలిపోవలిసిందేనా?

ప్రపంచం...ఆ వృద్ధురాలికి అతనే ప్రపంచం... అతను లేడు. ప్రపంచమూ లేదు. భగవంతుడుకూడా వోర్చలేకపోయాడుకాబోలు ... తనని చూసే భగవంతుడికి కళ్లు కుట్టాలేం?...పిరికివాడి ప్రతాపం పిచికమీదనేనా? అవును...దేవుడు పిరికివాడే అయివుండాలి...యేమో! పిరికివాడో, ధైర్యశాలో అవడానికి భగవంతుడనేవాడు అసలున్నాడా అనే తన సందేహం. ఆమెజీవితంలో సూర్యుడస్తమించాడు. తనబ్రతుకు, ప్రపంచంబ్రతుకు,—సర్వాన్నీ చీకటి మింగేసింది. ఇక వెన్నెల కాయదు. పగలు రాదు. జీవితం యెలా కొనసాగించాలి? చరమదశవరకు తను అనాథగా, యేకాకిగా, ప్రజల దాక్షిణ్యంమీద ఆధారపడి భారమైన జీవితాన్ని యీడ్చాలి. చనిపోయాక తన శవానికి దహనసంస్కారం చేసేవారే వుండరు!

వొణికే చేతుల్లోని కొడుకుచిత్రంమీద కన్నీటిచుక్కలు వొక్కొక్కటిగా పడుతున్నాయి ప్రయాసతో... దుఃఖంతో గుండె రొండిపోయిందేమో! ఛాయాచిత్రంలోంచి కొడుకు అమాయకంగా నవ్వుతున్నాడు... తల్లిపుత్రశోకం అతనికి తెలుస్తుందా? తల్లిపంచనైనా గాకుండా, యెక్కడో, మనుష్యులు—మానవత్వం వున్న మనుష్యులు—నివసించలేని ప్రదేశంలో, యమయాతన ననుభవించి ప్రాణాలు విడిచాడు. అతని ఆఖరుమాటలనైనా వినడానికి తల్లి నోచుకోలేదు. మృత్యువుగాదు అతన్ని పొట్టబెట్టుకున్నది-ప్రభుత్వం...ఒక్కగానొక్క కొడుకుమీదే ఆశలన్నీ కేంద్రీకరించిన ముసలితల్లిని దిక్కులేనిదాన్నిగా జేసిన ప్రభుత్వం...

"మధూ! చిట్టితండ్రీ! నువ్వులేని నా బతుకెందుకు? దేవుడు నన్నుకూడా త్వరగా మీ తండ్రీ కొడుకుల దగ్గరకు తీసుకురావాలని ప్రార్థిస్తున్నాను. నే నెవరికోసమని యింకా జీవించను? నిన్ను అకాల మరణం పాలుచేసిన ప్రభుత్వం, అందుకు బాధ్యులైన ప్రజలు, నన్నుకూడా అంత యెందించకూడదూ?... నవ్వుతున్నావా మధూ? ఇల్లంతా వెలిగే నీ నవ్వు నాకు కరువైంది నాయనా!"

సన్నగా యేడుస్తూ, కొడుకుఫోటోని హృదయానికి హత్తుకుని గొణుగుతున్నది...తన కొడుకుని మోసం చేసి, అధోగతి కీడ్చినవారంతరూ యేరీ? అరచేతిలో స్వర్గం చూపించినవా రొక్కరూ ఆమె నోదార్చడానికి రారేం? ప్రపంచంలో యింత స్వార్థం, యింత ద్రోహం, వున్నదని ఆమె యీరోజే తెలుసుకోగలిగింది. మానవరూపదానవులుకూడా వున్నారని యిప్పుడే తెలుస్తోంది ఆ నిరాధారప్రాణికి...

మధుతండ్రివొంటినిండా దుమ్ము కమ్ముకొని వుంది. నిండువిగ్రహంతో, ఠీవిగా చూస్తున్నాడు యీ అభాగ్యురాలి

రాలిని...కాని ఆ చూపుల్లో జాలి వుంది. జీవంమాత్రం లేదు. అతను గోడమీద ఫోటోచట్రంలో బంధించబడి వున్నాడు. లేకుంటే వోదార్చేవాడేమో...

"మీరు యీ బాధ లేకుండా సుఖంగా వెళ్లిపోయారు. నాలాగా పుత్రవియోగం మీకు కలగలేదు. మనుజీవితం వెలుగుబాటులు తొక్కడం చూచి సంతోషించారు. వాడి జీవితంమీద చీకటితెరలు కమ్మడం చూచి మథనపడే అవస్థ తప్పించుకున్నారు. తండ్రీకొడుకులు అక్కడ కలుసుకున్నారు. మళ్లీ...నేనే మిగిలాను. ఇద్దరూ నన్ను నిస్సహాయురాలినిగా చేశారెందుకూ ?"

ఆమె మీమాంసలో పడింది...కొత్తలో, జీవితంలో పచ్చదనం మిలమిలలాడుతుంటే, అంచరం సర్వానికి అధినేతల మనుకుంటాం...వూహాచిత్రాలలో వూగిసలాడ్తాం...ఐతే...విజ్ఞానం పండుబారేకొద్దీ, ఆనందం మొన మొక్కవోతుంది...అనుభవం, ఆశలకు జరిగే రణంలో అనుకున్నవన్నీ అనుకోని పరిణామం పొందుతాయి...ఆదర్శాలకు, సిద్ధాంతాలకు పర్యవసానం యేమిటి ! జీవితమంతా వాటికోసమే పోరాడినా సాఫల్యం లేనప్పుడు, వాటికోసం ప్రాకులాడడం వృథాకామా ? జీవితం నడకనే మనం అనుసరించాలి గాని, మన నడకని జీవితం అనుసరించదు. అందుకు తన చరిత్రే వ్యాఖ్యానం.

అందరూ వెక్కిరించారు. కొక్కిరించారు. "యీ ప్రేమవివాహాలు చాలారోజులుండవు లే." అనీ, "కొత్తమురిపెం తీరాక చిన్నతప్పులే కొండంతలై భేదాలకు దారితీస్తాయి" అనీ, నిరుత్సాహబాణాలు వదిలారు ఛాందసులు, ఆచారవంతులు.

అతనిలో వున్న చిత్రకళానైపుణ్యం ప్రజలను వెగ్గెత్తించింది. అతని చేతిలో కుంచె వొక సమ్మోహనాస్త్రమే...చిత్రకళని అతను నవ్యపథాలలో నడిపించాడు. ప్రతిచిత్రంలో వొక నూతన జీవకళ వుట్టిపడేది. పాశ్చాత్యకళ, భారతీయ కళ—యీ రెంటిలోని వుత్తమ లక్షణాలూ అతని చిత్రకళలో ప్రతిబింబించేవి. కళకూ, అతనికీ భేదం లేదు. జీవితాన్నే కళకు అంకితం యిచ్చాడు. ఆనాటి మైకేల్ ఏంజలో చిత్రాలు, యీనాడు సుధీర్ ఖస్తగీర్, దామెర్ల, నందలాల్ బోస్ చిత్రాలూ అతని కిచ్చే ఆనంద, ఆవేశాలకు యెల్లలు లేవు. ఐనా వాళ్ళ ననుకరించడం అతని కిష్టంలేదు. చిత్రకారుడుగా తనూ వొక కొన్ని వుజ్వల ఆదర్శాలతో వ్యక్తిత్వం సంపాదించాలనే అతడి ఆశయం. చిత్రరచనలో సింబాలిజం, సర్రియలిజం, తత్వాలకు చెందిన పికాసో, సాల్వర్ దాలీ చిత్రాలను చూచినప్పుడు, మాటల్లో వారి ప్రసక్తి వచ్చినప్పుడు, ఉగ్రరూపం ధరించడం పరిపాటయింది...

"...ఏ కళఐనాసరే మానవజీవితంలోని వెలుగు నీడల్ని ప్రతిబింబించాలి. మనలో వుండే లోటుపాట్లని చూపించి, సక్రమమార్గం ప్రబోధించడమే ముఖ్యమైనప్పుడు, కళలు అందరికీ అందుబాటులో వుండాలి గదా ! అందరూ అర్థం చేసుకోవాలిగదా ! ఎవరికీ అర్థంకాని, జుగుప్సకలిగించే చిత్రాలను మనం సహించరాదు. మానసికచంచలత్వం, హైన్యం, దౌర్బల్యం, నిబిడత్వాలు వీరి చిత్రాల్లో గోచరిస్తాయి. అందుకే అవి కారడవులు, చీకటిగుహలు. సంఘాన్ని యేమాత్రం ముందుకు నడిపించలేవు..." అదీ అతని వాదన...అతని సిద్ధాంతాలు యీ వాదనబట్టి మనం వూహించవచ్చు.

ఆమెను చూస్తే సంగీతమే సచేతనమై ఆ రూపం ధరించిందా అనిపిస్తుంది...ఆమె కంఠంలో అంతటి మాధుర్యం వున్నది. "రాల్కరగించు విమలగంధర్వగానం" అనే అతిశయోక్తి అలంకారం వాడడం తగదుగాని, ఆ వర్ణనభావం ఆవిడగానంలోని ఔన్నత్యాన్ని స్ఫురింపజేస్తోందంటే వొప్పుకోవచ్చు... సంగీతం అంటే సుఖంగా ఆలాపించేది, సుఖంగా వినేది గాబట్టి, సునాయాసంగా పాడే సంగీతం ఉత్కృష్టమైందని ఆమె అభిమతం..."సంగీతంపరమావధి వినేవారికి ఆనందం కలిగించడమే...యే సంగీతమైనా సరే, వినేవారు ఆ కొన్నిక్షణాలు సర్వం మరిచి సంతృప్తిపొందారంటే, ఆ సంగీతం సఫలమైనట్టే...

అలాంటప్పుడు శ్రోతను శాస్త్రకట్టు సక్కసుతో విసిగించడం దేనికి ? పాండిత్యం ప్రదర్శించడంకన్న—అంటే సరిగమల వల్లింపు—యెదుటివారిని సాక్షీసంగీతంతో మైమరపించుటే ముఖ్యం. ఎందుకంటే వినే వాళ్ళల్లో నూటికి తొంభయిమంది పండితులు కారు—వాళ్ళు కోరేది సంగీతమాత్రమే అనిమరచిపోకూడదు..."

సంగీతాన్ని ఆమె యీవిధంగా నిర్వచించింది...ఆ నిర్వచనతో కొమ్ములు తిరిగినవాళ్ళతో యుద్ధం చేసి, విజయపతాక నెత్తింది. అందుకే ఆవిడని చూస్తే సంగీతయోధులకు కన్నెర్ర...

అతడి చిత్రాలను చూచి...చూచి...తనివి తీరనివారున్నారు. అతను చిత్రించిన ఆకలిమంటలలో అలమటించే బీదల జీవితదృశ్యాలు, ఆ దృశ్యాలు చూచి కళ్ళనీళ్ళు పెట్టుకున్నవారెంతమందో! ప్రతిచిత్రానికి యేదో వొక నూతనత్వం కల్పించాడు...కళ నూతనవిన్యాసాలతో చిందులాడి, ప్రజ ఘటించిన అంజలి నందుకుంది...ఆవిధంగానే ఆమె సంగీతంకూడా సర్వజనామోదం పొందింది. ప్రజలేగాక ప్రకృతికూడా ఆమె గానాన్ని మంత్రముగ్ధమై ఆలకించింది. ఆమె కళకు యెలాంటి వర్గభేదాలూ, కులభేదాలూ అవరోధం కల్పించలేకపోయాయి.

ఆమె సంగీతానికి అతను జోహారర్పించాడు. అతడి చిత్రలేఖనాని కామె వివశురాలైంది. ఒకరి ఔన్నత్యానికి వొకరు తలవొగ్గారు. కళాహృదయాలు నిర్మలప్రేమతో స్పందించాయి...కులాలు వేరైనా కళ వొకటే అవడంవల్ల పరస్పరవాంఛ రానురాను బలపడింది.

"వాణీ! యింకా యెన్నాళ్ళు యీ దాగుడుమూతలు ?..."అన్నాడు అతను.

"ఐతే వెనుకముందులు చూడకుండా దూకుతామా గోపీ ?..."అంది వాణి.

"వెనుకచూపు మన కెందుకు ? ముందుకే నడుద్దాం..."గోపీమాట.

"ముందుకే నడిచినా బాటలో ఆటంకాలున్నాయేమో చూడొద్దా ?..."వాణి ప్రశ్న.

"బాటలో ఆటంకాల్ని పక్కచేస్తే ముందుకు నడవడం కాదు..." గోపి అన్నాడు.

"ఐతే యేం చేద్దామని ?..."వాణి రెండో ప్రశ్న వేసింది.

"పెళ్ళి చేసుకుని, మన యిద్దరి కళల నేకం చేద్దాం..."గోపీ జవాబు.

"అలా జరగాలంటే, మన ఆర్థికస్థితికూడా పరిశీలించడం మంచిది..."వాణి సలహా.

"ఆ ప్రసక్తి మన కిప్పుడే యెందుకూ ? కళవల్ల సంపాదించలేమా ?..."అడిగాడు గోపీ.

"సమాజనియమాలకు వ్యతిరేకంగా పెళ్ళిచేసుకున్న మనల్ని సమాజం ఆదరించదు. వాళ్ళ మాటలు పాటించలేదని బంధువులు సహాయం చేయరు..."వాణి విశదీకరించింది.

"ఏమీ జరగదు. నిర్భయంగా వుండు..." గోపి వుత్తేజన.

"మన గురించి గాదు నా సందేహం! మన సంతానంగతి యేం గావాలి? ఆర్థికంగా బలవంతులేం చేసినా చెల్లుతుంది. సంస్కారాలు వాళ్ళకే. మన గాదు!..."వాణి వాదన.

"రేపటిసంగతి రేపే! ముందు అపాయ ముందని యిప్పటినుంచే భయపడ్డం యెందుకు వాణీ ?..."గోపీ వుత్సాహంగా పలికాడు.

"మన పనులకు మన సంతానం బాధ్యత వహించడం అన్యాయం..."వాణి సమర్థించుకున్నది.

"వాణీ ! అవన్నీ భ్రమలు...యిక మన పెళ్ళి ఆపడం నేను భరించను."

"గోపీ ! నాకూ కష్టమే! దూరదృష్టి మంచిదన్నాను, అంతే...నువ్వు నిర్ణయించిన రోజునే పెళ్ళి చేసుకుందాం...సరా ?"

స్నేహితులు, అభిమానులు, వారి వివాహాన్ని అభినందించారు...అది అపూర్వకళాసంగమం అని ప్రశంసించారు. "సంగీతమనీ, చిత్రలేఖనమనీ, కళ అనీ యేవో పిచ్చివేషాల్తో ఐన యీ పెళ్ళి, వీళ్ళ ప్రేమ యెన్నాళ్ళు నిలుస్తుందిలే!"అంటూ పెదిమలు విరిచారు ముదిమివచ్చిన సంఘస్తంభాలు...

పెళ్ళయి యిరవై సంవత్సరాలు—మరో ఐదేళ్లు గడిచినై...యీ రోజు వాణి తమ పంచప్రాణమైన కొడుకు మరణానికి విలపిస్తోంది...తన ఆదర్శవివాహ ఫలమైన మధు—తమిద్దరి ఆశలూ, ఆశయాల్నీ కేంద్రీకరించిన యేకైకపుత్రుడు—తన జీవితసర్వస్వమైన గోపీవియోగంతో దుఃఖిస్తున్న వాణిని వదలి యెక్కడో కటకటాలవెనక ప్రాణాలు విడిచాడు...చితికిన వాణి హృదయంమీద అది సమ్మెటపోటు గాదూ?

గోపీ, వాణీలు బంధువులకు దూరమైనా కళకు మాత్రం దూరం కాలేదు. వేరే కులాలవారైన వాళ్ళిద్దరి పెళ్ళి సహించని ఆచారపరాయణు లందరూ శాపనార్థాలు పెట్టారు. అవి వాళ్ళిద్దరికీ దీవన లయాయి. ఆ కళాజీవుల అన్యోన్యతకు భంగం యే మాత్రం రాలేదు...పగబట్టినవాళ్లు పొగలుగక్కుతూ వాళ్ళకు హానిచేయలేక పోయారు...ఆర్థికస్థితి బలంగా వున్నంత వరకు అది వీలుకాదు.

మధు పుట్టిన రోజున ఆ దంపతుల ఆనందం కట్టలుతెగి పారింది. కుమారుడి భావిగురించి యెన్నో మధురమైన కలలు గన్నారు. తమిద్దరి ఆశయాలూ కుమారుడిలో ప్రతిఫలిస్తాయనీ, తమిద్దరి కళలూ వాడిలో యేకమవుతాయనీ వూహాసౌధాలు నిర్మించారు...కాని మధు...పెద్దవాడయే కొద్దీ, ఆ రెండు కళలమీదా ప్రేమ చూపలేక పోయాడు. యెప్పుడన్నా గోపీ కొడుక్కి తన ఆదర్శాలు బోధపరచాలనే ప్రయత్నాలు విఫలమయేయి. "...వీళ్ళిద్దరికీ యిదో పిచ్చి! వీటిమూలాన దేశాన్ని యేం బాగుపరచ గలిగారు? పూర్వకాలం మనుష్యులు!" మధు నవ్వుకునేవాడు. గోపీ, వాణీలు నిరుత్సాహం చెందారు. కొడుకు పోకడలకు ఆశ్చర్యపడేవారు. "మధు యెందుకిలా తయారవుతున్నాడు? రాచకీయాలూ, విజ్ఞానం మీద వాడికి తగని మమకారం! వొట్టి కుర్రతనం!"......వాళ్ళు చూస్తుండగానే రోజురోజుకీ మధు రాజకీయాల్లోకి చొచ్చుకు వెళ్తున్నాడు. తలిదండ్రుల మందలింపులు పనిచేయలేక పోయాయి...

గోపీ ఆకస్మికంగా హృద్రోగంతో మంచంపట్టాడు; తగిన విశ్రాంతి లేకుండా నిరంతరం పనిచేయడమే కారణమేమో! "వాణీ! కొడుకు విషయంలో జాగ్రత్త...వాడి కోరికలకు ఆటంకపడకు...మన ఆదర్శాలకు స్ఫూర్తి లేకంగా వెళ్లాడని ప్రేమించడం మానవద్దు!" భార్యతో చివరి మాటలు..."నాయనా! నీ ఆశయాలకు యెవ్వరూ అడ్డురారు...నీ తల్లి భారం మాత్రం నీదే! నువ్వే వాణికి సర్వం! నీతల్లి సుఖమే నీ కర్తవ్యం!" మధుకి తండ్రి యిచ్చిన ఆఖరి సలహా అది.

తండ్రి చనిపోయిన కొన్ని రోజులకే మధు రాజకీయాల కారణంగా ప్రభుత్వకారాగారానికి అతిథి అయ్యాడు. తల్లిని వదిలివెళ్ళడం అతడికి కష్టమే ఐనా విధిలేదు. మూర్తీభవించిన శోకమే ఐంది వాణి...... యెప్పుడో, నెలకొకటిగా వచ్చే వుత్తరాలు జైలు నుంచి...వాణి వాటిని ప్రాణప్రదంగా దాచుకున్నది... కొడుకు ఆరోగ్యం గురించి దారుణమైన వార్తలు వచ్చాయి...మధుని మళ్ళీ చూచివద్దా మనుకుంటుండగానే వచ్చింది ప్రళయం...మధు చనిపోయాడు...!

ఇదేనా పర్యవసానం? చరమసంధ్య పరిణామం యిదేనా? ఆ అభాగిని కళ్ళల్లోనుంచి అశ్రువులు రాలుతున్నాయి...కాదు...తీరని వ్యథతో ఆమె హృదయమే కరిగి ప్రవహిస్తున్నదేమో! ముసలితనంతో ముడతలుపడ్డ ఆమె చెక్కిళ్ళమీదుగా కన్నీరు ప్రయాసతో జారి, వొణికే చేతుల్లోని కొడుకు ఛాయాచిత్రం మీద పడ్తున్నది......మధు అమాయకంగా నవ్వుతున్నాడు...తీవిగా చూస్తున్నాడు గోడమీద చిత్రములో గోపీ...ఆ చూపుల్లో జాలి వుంది......జీవం లేదు...!

